క్లుప్తంగా

అనవసర లింక్‌లు ఓపెన్ చేయొద్దు



మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి

గోదావరిఖనిటౌన్: వన్‌టౌన్ పోలీసులు స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు సైబర్ నేరాల నియంత్రణపై మంగళవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో వచ్చే అనవసర లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. మహిళల భద్రతకై పోలీసు యంత్రాంగం 24 గంటలు పనిచేస్తుందని, ప్రమాద సమయంలో డయల్ 100కు కాల్ చేస్తే పోలీసులు అక్కడికి చేరుకొని రక్షణ కల్పిస్తారని వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై సుగుణాకర్, కళాశాల ప్రిన్సిపాల్ కటకం అంజయ్య, అధ్యాపకులు దామెర శంకర్, రజిత, సంపత్, రాజ్యలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు రూ.10లక్షల విరాళం



చెక్కు అందజేస్తున్న రాధాకిషన్ కుటుంబం

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని శ్రీకోదండ రామాలయంలోని రామాలయం రాజగోపురం, శివాలయం రాజగోపుర నిర్మాణానికి కుక్కల గూడూరుకు చెందిన అమెరికాలో స్థిరపడిన ఎన్ఆర్ఐ పోతరాజుల రాధాకిషన్, అంబికాదేవి దంపతులు వారి కుమారుడు శ్రీవత్రధర్ రూ.10లక్షల చెక్కు మంగళవారం ఆలయ ఈవో ముద్దసాని శంకరయ్యకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు మధుసూదనాచార్యులు, అర్చకులు శశిధరాచార్యులు, చంద్రశేఖర శర్మ ఉన్నారు.

గుంతల రోడ్డు పరిశీలన

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ సింధూర కళాశాల రోడ్డులో ఉన్న గుంతలను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పరిశీలించారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'రోడ్డుపై గుంతలు తప్పని తిప్పలు' కథనంపై ఐదో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి రవి ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌కు విషయం తెలియజేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గుంతల రోడ్డును కమిషనర్ పరిశీలించినట్లు రవి తెలిపారు.

క్రీడా పాఠశాలకు ఎంపిక



అభిజ్ఞ

కాల్వశ్రీరాంపూర్: క్రీడా పాఠశాల ప్రవేశ ఎంపిక పోటీల్లో కాల్వశ్రీరాంపూర్ మండలం ఊశన్నపల్లె ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పెంతాల అభిజ్ఞ ఎంపికై నట్లు ఎంఈవో సురేందర్ కుమార్ తెలిపారు. అభిజ్ఞను ఎంఈవో, హెచ్ఎం ఈర్ల సమ్మయ్య, గ్రామస్తులు అభినందించారు.

మిర్యాల రాజిరెడ్డిపై చర్యలు తీసుకోండి

రామగిరి: టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సింగరేణి విధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని సోమవారం రాత్రి సీఅండ్ఎండీ బలరాం నాయక్‌కు రత్నాపూర్ ఎంపీటీసీ దర్శుల రాజా సంపత్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సింగరేణి నిబంధనలను అతిక్రమించి ఎలాంటి సెలవు పెట్టకుండా మస్టర్ పడి సొంత పనులకు వెళ్తున్నాడని, ఇలా అనేక సార్లు సొంత పనులకు వెళ్లి సింగరేణి సంస్థకు నష్టం కలిగించాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. గతంలో గోదావరిఖని ఒకటో టౌన్‌లో నమోదైన కేసుకు సంబంధించి కోర్టు విచారణకు హాజరైన తేదీలను పరిశీలిస్తే 13సార్లు మస్టర్లు పడి కోర్టు విచారణకు హాజరయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సింగరేణి సంస్థకు నష్టం కలిగిస్తున్న మిర్యాల రాజిరెడ్డిపై విచారణ చేయాలని ఫిర్యాదులో కోరినట్లు సంపత్ తెలిపారు.

ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయం, హనుమాన్ ఆలయాల్లో ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం శివాలయంలో స్వామివారికి పలు రకాల పండ్లతో రుద్రాభిషేకం నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహానికి అలంకరణ చేయడంతో పాటు అభిషేకం చేశారు. పూజారి మహేశ్, ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, భక్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి వేడుకలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలో మంగళవారం ఏకాదశి పర్వదిన వేడుకలు మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చక పూజారులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

ఆర్టీసీ పథకాలపై కళాకారుల ప్రదర్శన



గోదావరిఖని: అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మంథని: మంథని బస్టాండ్, డిపోలో సంస్థ పథకాలను కళాకారులు ప్రదర్శన రూపంలో వివరించారు. ఆర్టీసీలో అమలవుతున్న మహాలక్ష్మి పథకంతో పాటు ఇతర అంశాలపై కళాబృందం వివరించింది. ఆర్టీసీని ఆదరించాలని అందరూ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని కోరారు. ప్రతీ ఉద్యోగి సంస్థ ప్రయోజనం, ఆదాయాన్ని సమకూర్చేలా పనిచేయాలని మంథని ఇన్‌చార్జి డీఎం నాగభూషణం కోరారు. డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఏంజిల్, గోదావరిఖని ఎస్టీఐ కమల ఎస్టీఐ గోపాల్ ఉన్నారు.

గోదావరిఖనిటౌన్: కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ కళాజాత బృందం మంగళవారం స్థానిక గోదావరిఖని ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లో లక్షే లక్ష్యంపై నాటిక ప్రదర్శన, పాటల ద్వారా ఆర్టీసీ ఉద్యోగులకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఆర్టీసీ డిపో సంవత్సరానికి అదనంగా రూ.లక్ష నగదు ఆదాయం సంపాదనే లక్ష్యంగా ప్రవేశపెట్టిన లక్షే లక్ష్యం ప్రాముఖ్యత గురించి పాటలు, నృత్యాల వివరించారు. ఆర్టీసీ కళాజాత బృందం ఎస్టీఐ కమల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోదావరిఖని డిపో మేనేజర్ ఎం.నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్ కె.గీతాకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ కె.సంధ్యారాణి పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కుక్కల బెడద

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కుక్కల బెడదతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేస్టేషన్ బుకింగ్ ప్రాంగణంలో ప్రయాణికులు వేచి ఉండే కుర్చీల వద్ద, ప్లాట్‌ఫారంపై కొన్ని కుక్కలు సంచరిస్తూ భయాందోళనకు గురి చేస్తున్నాయి. వీటి సంచారంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత రైల్వే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సోగాల తిరుపతి



నియామక పత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్

ధర్మారం: యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సోగాల తిరుపతిని నియమిస్తున్నట్లు ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రకటించారు. ధర్మారం మండలం కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్షుడిగా తిరుపతి, ఉపాధ్యక్షుడిగా మండలంలోని పెర్కపల్లి గ్రామానికి చెందిన బుట్టిసాగర్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందించారు.

పోలీసులకు నిందితుల సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్సై అశోక్‌రెడ్డి

ఓదెల: నిందితుల సమాచారం పోలీసులకు ఇవ్వాలని పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి కోరారు. మండలంలోని పొత్కపల్లిలో ఎస్సై ఆధ్వర్యంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త వ్యక్తులు, నేరస్తులు ఎవరైనా షెల్టర్ తీసుకొని ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గంజాయి, డ్రగ్స్ వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు.

గురుకుల పాఠశాల సందర్శన

గోదావరిఖనిటౌన్: స్థానిక సప్తగిరికాలనీలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ కమిటీ సభ్యులు మంగళవారం సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిర్వహణలో లోపాలున్నా, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బందికి తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మహేందర్‌గౌడ్, సభ్యులు కనకయ్య, కిరణ్, విజయ్, వంశీ, రామరాజు, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కిందపడిన విద్యుత్ స్తంభం.. తప్పిన ప్రమాదం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి ఎస్సీకాలనీలో మంగళవారం ఓ వ్యక్తి తమ ఇంటి ముందున్న చెట్టును నరికేసే క్రమంలో కొమ్మలు విద్యుత్ లైన్ మీద పడి రెండు స్తంభాలు నేలమట్టమయ్యాయి. ట్రాన్స్‌కో అధికారులకుసెలాంటి సమాచారం ఇవ్వకుండానే ఆ వ్యక్తి చెట్టును నరికేశాడని స్థానికులు తెలిపారు. విద్యుత్ సరఫరా ఉన్న సమయంలోనే చెట్టుకొమ్మలు పడి కింద స్తంభాలు కూలిపోయాయని, ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందన్నారు. ప్రస్తుతం ఎస్సీకాలనీలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్ గేట్ సమీపంలోని రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రామగుండంకు చెందిన అహ్మద్‌పాషా బైక్‌పై రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో డీకే.రావు గోదావరిఖని వైపు నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. రెండు వాహనాలు ఢీకొనడంతో అహ్మద్‌పాషా కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు అతని కుటుంబసభ్యులు కరీంనగర్ తీసుకెళ్లారు.

బదిలీపై వెళ్తున్న ఎన్టీపీసీ ఉద్యోగికి సన్మానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌లోని సదరన్ రీజియన్ హెడ్‌క్వార్టర్స్‌కు బదిలీపై వెళ్తున్న సబ్ ఇంజనీర్ పి.నరేందర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. నరేందర్‌ను శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు.

ప్రయివేట్ స్కూల్‌కు హైకోర్టు నోటీసులు

గోదావరిఖనిటౌన్: నగరంలోని ఒక ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తుందని ఓ ప్రైవేట్ స్కూల్ నిర్వాహకుడు కోట కుమార్ జూన్‌లో హైకోర్టులో పిటిషన్ వేశాడు. హైకోర్టు స్పందిస్తూ ఆ పాఠశాల నిర్వహణను నిలిపివేయాలని యాజమాన్యానికి, సీబీఎస్ఈ చైర్మన్, రీజినల్ జాయింట్ డైరెక్టర్, కలెక్టర్, జిల్లా, మండల విద్యాధికారికి ఇటీవల నోటీసులు జారీ చేసినట్లు కోటకుమార్ మంగళవారం తెలిపారు.

బీఎంఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్‌గా వద్దేపల్లి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ బీఎంఎస్ ఆర్జీ–2 ఏరియా వైస్ ప్రెసిడెంట్‌గా వద్దేపల్లి కుమారస్వామిని నియమించినట్లు సంఘం అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య పేర్కొన్నారు. యైటింక్లయిన్‌కాలనీ బీఎంఎస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో బీఎంఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రైతుల అభిప్రాయం మేరకు రైతుభరోసా

జూలపల్లి: రైతుల అభిప్రాయం మేరకు ప్రభుత్వం రైతుభరోసా ఇచ్చే ఆలోచన చేస్తోందని కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల సహకార శాఖ అధికారి రామానుజాచార్యులు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతుబంధుపై రైతుల నుంచి అభిప్రాయ సేకరించారు.

ఎలిగేడులో రైతుభరోసాపై సమావేశం

ఎలిగేడు: ఎలిగేడు సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ అధ్యక్షతన మంగళవారం ఎలిగేడు రైతువేదికలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యవసాయశాఖ ఏడీఏ కాంతారావు రైతుభరోసాపై రైతుల అభిప్రాయాలు సేకరించారు. సింగిల్‌విండో చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జేఏసీతో కలిసి పోరాటానికి సిద్ధం కావాలి

గోదావరిఖని: సింగరేణి బొగ్గు గనుల ప్రయివేటీకరణపై ఐక్యకార్యాచరణ కమిటీ(జేఏసీ)తో కలిసి పోరాటానికి సిద్ధం కావాలని కన్వీనర్ రియాజ్ అహ్మద్ కోరారు. ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, ఐఎన్టీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్ యూనియన్లకు వేర్వేరుగా లేఖ పంపినట్లు ఆయన పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న కార్మిక సంఘాలన్నీ జేఏసీతో కలిసి వచ్చి పోరాటాన్ని ఉధృతం చేయాలని కోరారు.

భద్రతతో కూడిన ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న జీఎం ఎస్.సుధాకర్‌రావు

రామగిరి: నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించడానికి సమష్టిగా కృషిచేస్తూ భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు సూచించారు. జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్జీ–3 ఏరియాలోని గనులకు సంబంధించి భద్రత, బొగ్గు ఉత్పత్తి, బొగ్గు రవాణాపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓసీపీ–1, 2 ఉపరితల గనుల ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా, మట్టి వెలికితీత లక్ష్యాలపై చర్చించారు. నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి సాధించడానికి, నిర్దేశించిన బొగ్గు రవాణా చేయడానికి అనుగుణంగా తమవంతు కృషి చేస్తూ లక్ష్యాలను భద్రతతో సాధించాలని కోరారు. వర్షాకాలంలో ఉపరితల గనుల్లో జాగ్రతలు తీసుకోవాలని, ఉత్పత్తికి అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ప్రాజెక్టు అధికారులు ఎన్.రాధాకృష్ణ, కె.రాజేందర్, ఏరియా ఇంజనీర్ వై.శేఖర్ బాబు, ఏరియా సేఫ్టీ అధికారి వెంకటరమణ, ఏరియా సర్వే అధికారి జనార్దన్‌రెడ్డి, పర్యావరణ అధికారి రాజారెడ్డి, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్లు, నాణ్యత అధికారి పాల్గొన్నారు.

సింగరేణి అభివృద్ధికి కృషిచేయాలి



మాట్లాడుతున్న ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు

రామగిరి: ప్రతీ ఉద్యోగి సింగరేణి అభివృద్ధికి కృషి చేయాలని, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని ఏపీఏ జీఎం కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. వివిధ కారణాలతో డిపెండెంట్లకు సంబంధించిన సుమారు 69 మంది కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను అందజేయగా స్థానిక ఎంవీటీసీలో శిక్షణ పొందుతున్నారు. ఎంవీటీసీలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం జీఎం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన తర్వాత క్రమం తప్పకుండా విధులకు హాజరుకావాలని సూచించారు. సింగరేణి సంస్థలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడానికి అనేక అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని పదోన్నతి పొందాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. ఎస్ఓటూ జీఎం బి.సత్యనారాయణ, ఎంవీటీసీ మేనేజర్లు మల్లన్న, డీవైఎస్ఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించండి



మాట్లాడుతున్న కోట రవీందర్‌రెడ్డి

రామగిరి: ఎన్నో ఏళ్లుగా ఆర్జీ–3, ఏపీఏ ఏరియాలోని కార్మికుల సంక్షేమంపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టిసారించాలని ఐఎన్టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. సెంటనరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లోని ఆయా గనుల్లో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఓసీపీ–2 మైన్ నుంచి అమ్మవారి ఆలయానికి వెళ్లే దారి, వన్నూర్ క్రాస్‌రోడ్ నుంచి ఏపీఏ గని వరకు రహదారి మరమ్మతు నిర్వహించాలని కోరారు. సెంటనరీకాలనీలో దోమల బెడద, కుక్కల బెడద నివారించాలన్నారు. ఏపీఏ గనిలో మరుగుదొడ్ల సంఖ్య పెంచాలని, అన్ని అండర్ గ్రౌండ్‌ల మాదిరిగా సర్ఫేస్ మజ్దూర్ ఇవ్వాలన్నారు. అనంతరం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కొప్పుల వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఐఎన్టీయూసీ నాయకులు సత్రం సమ్మయ్య, సాయికృష్ణ, బెల్లం శ్రీనివాస్, ఉయ్యాల కుమార్‌స్వామి, మంగయ్య, వెంకటస్వామి, సదానందం, మడ్డి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ల్యాప్‌టాప్ అందజేత



ల్యాప్‌టాప్ అందజేస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సుల్తానాబాద్‌కు చెందిన శశిక, తిరుపతి అనే విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ల్యాప్‌టాప్‌లను ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవూఫ్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

కౌన్సిలర్ మృతికి సంతాపం

పెద్దపల్లి మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ కొంతం శ్రీనివాసరెడ్డి ఇటీవల మరణించగా మంగళవారం ఎమ్మెల్యే విజయరమణారావు ఆయన కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. శ్రీనివాసరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న మొగిలి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి అన్నారు. ఆర్జీ–2 ఏరియా కృషి భవన్‌లో మంగళవారం ప్రైవేట్ కన్వేయర్స్ డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2022లో కాంట్రాక్ట్ కార్మికులు 18రోజులు సమ్మె చేసిన కాలంలో ఒప్పందం కుదిరిన 12 డిమాండ్లలో ఒకటి కూడా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. రెండేళ్ల గడిచినా జీవో ప్రకారం కనీస వేతనాలు ఇవ్వకుండా సింగరేణి యజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పెంపుకోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి ఆందోళనలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఆందోళనలో అన్ని సెక్షన్ల కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నరేశ్, రాజ్‌కుమార్, రామన్న, సతీశ్, సంపత్, ఆనంద్, నాగరాజు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం



బహుమతి ప్రదానం చేస్తున్న జీఎంలు

రామగిరి: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గత నెల 8న పర్యావరణ పరిరక్షణ అంశంపై నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు మంగళవారం జీఎం కార్యాలయంలో ఆర్జీ–3, ఏపీఏ జీఎంలు ఎస్.సుధాకర్‌రావు, కె.వెంకటేశ్వర్లు బహుమతి ప్రదానం చేశారు. యూనియన్ల ప్రతినిధులు ఎం.ఆర్‌సీరెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ఏరియా అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్.వెంకటరమణ, పర్యావరణ అధికారి పి.రాజారెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం పి.శ్రీనివాసులు, ఏరియా ఇంజనీర్ వై.శేఖర్ బాబు, పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఐరన్‌స్క్రాప్ పట్టివేత



నిందితులను చూపిస్తున్న సెక్యూరిటీ

గోదావరిఖని: ఆర్జీ–1 ఏరియా జీడీకే–1వ గని నుంచి తరలిస్తున్న ఐరన్‌స్క్రాప్‌ను సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. కాంపౌండ్ వాల్ సైడ్‌రోడ్డు గోడపక్కన శబ్దం వస్తుందని గమనించిన సెక్యూరిటీ గార్డు వెంటనే షిఫ్ట్ జమేదార్‌కు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఇద్దరు వ్యక్తులు ఆటోలో పారిపోవడానికి ప్రయత్నించారు. వీరిని వెంబడించి పట్టుకున్నట్లు సెక్యూరిటీ సిబ్బంది తెలిపారు. పట్టుకున్న ఐరన్‌స్క్రాప్, ఆటోతో పాటు ఇద్దరిని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న స్క్రాప్ విలువ సుమారు రూ.20వేలు ఉంటుందన్నారు. యైటింక్లయిన్‌కాలనీకి చెందిన రవీందర్, రాజును పట్టుకుని పోలీసులకు అప్పగించామన్నారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ జె.ఉమేశ్, షిఫ్ట్ జమేదార్, ఎండీ అక్బర్‌అలీ, సిబ్బంది యాట ఓదెలు, రాజేశ్ ఉన్నారు. అప్రమత్తంగా వ్యవహరించి చోరీని అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బందిని సీనియర్ సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి అభినందించారు.

జెడ్పీటీసీకి సన్మానం

జూలపల్లి: పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్‌ను మంగళవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా స్థానిక మార్కండేయ ఆలయ కమ్యూనిటీ భవనంలో సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. సంఘం నాయకులు మేరుగు రమేశ్, సిరిపురం సత్యం, మేరుగు కనుకయ్య, కొండ సత్యం, సంబారి ఆంజనేయులు, బైరి భూమయ్య, శ్రీనివాస్, రాజేశ్వర్ ఉన్నారు.

పండ్ల మొక్కలు పంపిణీ



పండ్ల మొక్క అందజేస్తున్న కిరణ్

గోదావరిఖని: సింగరేణి ఆసుపత్రిలో ప్రసవించిన తల్లులకు మంగళవారం పండ్ల మొక్కలను అందజేశారు. ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ ఆదేశాల మేరకు డిశ్చార్జి అయిన బాలింతలకు ఏసీఎంఓ కిరణ్‌రాజ్‌కుమార్ పండ్ల మొక్కలు అందజేసి పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యత తెలియజేశారు. డాక్టర్లు అంబిక, ఇందిర, మాధవి, సుమన్ ఉన్నారు.

దేశ ఐక్యతకు పాటుపడిన మహనీయుడు శ్యాంప్రసాద్

జ్యోతినగర్: దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడిన మహనీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా ఇన్‌చార్జి క్యాతం వెంకటరమణ అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతోత్సవాల సందర్భంగా మంగళవారం మొక్కలు నాటారు. పార్టీ ఎన్టీపీసీ రామగుండం మండల అధ్యక్షుడు మిట్టపల్లి సతీశ్‌కుమార్, మండల నాయకులు ఈదునూరి చిరంజీవి, సిలివేరి ఆంజనేయులు, దామరకుంట గణేశ్, పల్లికొండ లక్ష్మణ్, భూమయ్య, సుమన్, ప్రశాంత్, హరి పాల్గొన్నారు.

ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవం



జ్యోతినగర్: శ్రీఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఎన్టీపీసీ రామగుండం పర్మినెంట్ టౌన్‌షిప్ వైకుంఠపురం హరిహర దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ రాపంల్లి మంగళవారం పూజలు చేశారు. పండితులు శ్రీహరి శర్మ, రుద్రభట్ల శ్రీకాంత్, గంగాధర శాస్త్రి, మారుపాక శ్రీకాంత్, ధర్మకర్త గిరి, మాజీ కార్పొరేటర్ కొలాని కవిత, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ్యుడు జనగామ తిరుపతి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి: ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–1 మైన్ రెమిడేషన్ ప్లాన్ కింద జూలపల్లి, ముల్కలపల్లి, వన్నూర్, రత్నాపూర్, నాగెపల్లి గ్రామాలకు చెందిన నిరుద్యోగ యువతకు కంప్యూటర్ డీటీపీ, పీజీడీసీఏ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆర్జీ–3 జీఎం ఎస్.సుధాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు పదో తరగతి పాసై ఉండాలని, అర్హత కలిగిన నిరుద్యోగులు శిక్షణ పొందుటకు ఈ నెల 15లోపు ఆధార్‌కార్డు, ఎస్ఎస్‌సీ మెమోలను జతచేసి దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆర్జీ–3 పర్సనల్ విభాగంలో అందజేయాలని కోరారు. మిగతా వివరాలకు 99491 56171, 99898 88001 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. ఇట్టి శిక్షణను సెంటనరీకాలనీ సేవాభవనంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బోయిన్‌పేటలో పోలీసుల కార్డెన్ సెర్చ్



అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

మంథని: మున్సిపాలిటీ పరిధిలోని బోయిన్‌పేటలో పోలీసులు మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలోని ఇంటింటా సోదాలు చేశారు. దుకాణాల తనిఖీ నిర్వహించారు. వాహనాల పత్రాలను పరిశీలించారు. అనంతరం ప్రధాన కూడలిలో మంథని సీఐ వెంకటేశ్వర్లు సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వ్యక్తుల సమాచారం పోలీసులకు అందించాలని కోరారు. గంజాయి, గుట్కాలతో ఇతర నిషేధిత వస్తువుల విక్రయాలు, అమ్మకాలు చేయొద్దని సూచించారు. ఎస్సై వెంకటకృష్ణ ఉన్నారు.